క్లుప్తంగా

పైపులైన్‌కు మరమ్మతులు



గండేపల్లి(కంచికచర్ల) : మండలంలోని గండేపల్లిలో జగనన్న కాలనీ లేఅవుట్‌కు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే సమయంలో ప్రధాన పైప్‌లైన్ పగిలిపోవడంతో బుధవారం జేసీబీ సాయంతో గోతులు తవ్వి పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. సర్పంచి బొక్కా రవికుమార్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిత్యం తాగునీరు సరఫరా అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచి బీ సుబ్బారావు,కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గౌరవరం(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారని గౌరవరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గౌరవరంలో బుధవారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును, ప్రధానసెంటరులో ఏర్పాటు చేసిన పార్టీ పతాకాన్ని వారు ఆవిష్కరించారు. సొసైటీ ఛైర్మన్ అన్నాబత్తుల శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ మల్లేశ్వరరావు, గ్రామ పార్టీ కన్వీనర్ బూతుకూరి శ్రీనివాసరెడ్డి, నాయకులు సయ్యద్ బాలసైదా, మేని రాము, మద్దుల శ్రీను, జగదీష్, గుడికందుల వెంకటేశ్వర్లు, కందుల నర్సిరెడ్డి, కార్యదర్శి జగ్గయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

కులగణనపై పారదర్శకంగా ఉండాలని ఆదేశం

జగ్గయ్యపేట అర్బన్: కులగణనలో కులధ్రువీకరణ పత్రాలు లేనివారి వివరాలు కూడా సిబ్బంది బాధ్యతాయుతంగా సేకరించి నమోదు చేయాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షేక్ హఫీజున్నీసా కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కులగణనకు సంబంధించి బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, కౌన్సిలర్లు వట్టిం మనోహర్, పందుల రోశయ్య, కాశి అనురాధ, గింజుపల్లి వెంకట్రావు, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారి గణేష్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు బద్దూనాయక్, పూసల పుల్లారావు, సయ్యద్‌అలీ పాల్గొన్నారు.

ఎన్జీవో నాయకుల సమీక్ష



కంచికచర్ల : స్థానిక ఏపీఎన్జీవోఎస్ సంఘ కార్యాలయంలో కంచికచర్ల తాలూకా సంఘ అధ్యక్షుడు ఏవీ శివారెడ్డి అధ్యక్షతన బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. కంచికచర్ల ఎన్జీఓస్ సంఘ కార్యదర్శిగా బీవీ రవికుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా కే శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా ఏఎస్ సునందారాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ జిల్లా కోశాధికారి బీ సతీష్‌కుమార్, సంఘ నాయకులు మంగళపూడి భిక్షాలు, యాదాల దాసు, వెంకటేశ్వర రెడ్డి, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

రైతన్నకు భారీనష్టం

- వణికించిన తుపాను
- నీటమునిగిన పొలాలు
- పొంగిపొర్లిన వాగులు
- స్తంభించిన జనజీవనం
- కలవరపడుతున్న రైతులు



నందిగామ మండలం పల్లగిరిలో నీట మునిగిన ధాన్యం రాశులు



దాములూరు కూడలి వద్ద కాజ్ వే పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

పెనుగంచిప్రోలు: మిచాంగ్ తుపాను ప్రభావంతో పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల రైతులకు భారీనష్టం వాటిల్లింది. తుపాను ప్రభావంతో బుధవారం తెల్లవారుజాము వరకు రెండురోజుల పాటు కురిసిన భారీవర్షాలతో పెనుగంచిప్రోలు మండలంలో లింగగూడెం వద్ద గండివాగు, ముచ్చింతాల వద్ద వాగు, అనిగండ్లపాడు వద్ద దూళ్లవాగు, కూచివాగు పొంగిపొర్లాయి. దీంతో కోతకు వచ్చిన వందలాది ఎకరాల వరిపైరు నీటి మునిగి రైతులకు భారీనష్టం వాటిల్లింది. వరిపైరుపై మోకాలు లోతు నీరు నిలిచి ఉంది. వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయి జనజీవనం స్తంభించింది. పూత, పిందె దశలో ఉన్న మిర్చి పైరు కూడా వర్షం, గాలులకు పూర్తిగా నేలకు ఒరిగింది. పూత రాలి పోవడంతో కాపు ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొద్దిగొప్ప ఉన్న కాయలు కూడా తాలు అవుతాయని రైతులు వాపోతున్నారు. పెనుగంచిప్రోలు మునేరు అవతల రైతులు జంగం కాశేశ్వరరావు, రాణి, ధారా శ్రీనివాసరావు, రాజేశ్వరీలకు చెందిన 80బస్తాల ధాన్యపు రాశులు వాగుపక్కన కల్లాలో ఉంచడంతో నీట మునిగాయి. వాగు నీరు ప్రవహించటంతో అనిగండ్లపాడు వద్ద గోపాలకృష్ణ, ఉమర్ తదితర రైతులకు చెందిన 150 బస్తాల ధాన్యం పూర్తిగా నీటిలో తేలాయి. ముచ్చింతాల, గుమ్మడిదూర్రు, వెల్దుర్తిపాడులో కూడా వరద నీటిలో పొలాలు, ధాన్యపు రాశులు నానుతున్నాయి. నీటిలో నానుతున్న ధాన్యం మొలక వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరద తగ్గాక పంటనష్టం లెక్కింపు..

పొలాల్లో వరద నీరు తగ్గిన వెంటనే వ్యవసాయశాఖ సిబ్బంది పంట నష్టాన్ని లెక్కిస్తారని పౌరసరఫరాలశాఖ జోనల్ మేనేజర్ ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. పెనుగంచిప్రోలు మండలంలోని అనిగండ్లపాడు, ముచ్చింతాల, గుమ్మడిదూర్రు గ్రామాల్లోని ముంపు ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టం అంచనా వేసిన తరువాత అధికారులకు నివేదిక ఇవ్వడంతోపాటు ప్రస్తుతం జరిగిన నష్టాన్ని తెలియజేస్తామని చెప్పారు. ఆయన వెంట తహశీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఏఓ కె.రామసుబ్బారెడ్డి, ఆర్ఐ జనార్దనరావు, సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

748.8 మిల్లీమీటర్ల వర్షపాతం

నందిగామ: తుపాను ప్రభావంతో నందిగామ ప్రాంతంలో బుధవారం భారీ వర్షం కురిసింది. డివిజన్ పరిధిలో మంగళవారం 784.8 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి పంటలు నీటిలోనే నానుతున్నాయి. పలుచోట్ల చెట్లు నెలకొరిగాయి. నందిగామలోని రైతుపేటలో జాతీయ రహదారి పక్కనే ఉన్న చెట్టు కూలి రోడ్డుపై పడింది. అధికారులు వెంటనే స్పందించి చెట్టును తొలగించి, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

వైరా నదికి భారీగా వరదనీరు..

తుపాను కారణంగా ఎగువప్రాంతంలో కురుస్తున్న కుండపోత వర్షాలకు వైరా నదికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో నందిగామ మండలం దాములూరు కూడలి వద్ద వైరా నదిపై ఉన్న కాజ్‌వే పైనుంచి సుమారు మూడు అడుగులకు పైగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో నందిగామ, వీరులపాడు మండలాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పలుచోట్ల వాగులు పొంగి పొర్లుతున్నాయి.

పెనుగంచిప్రోలులో అత్యధిక వర్షపాతం..

నందిగామ మండలంలో 123.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కంచికచర్ల మండలంలో 96.8 మిల్లీమీటర్లు, చందర్లపాడులో 102.8 మిల్లీమీటర్లు, వీరులపాడు లో 118.8 మిల్లీమీటర్లు, జగ్గయ్యపేటలో 104.8 మిల్లీమీటర్లు, వత్సవాయిలో 113.0మిల్లీమీటర్లు, కాగా డివిజన్ పరిధిలో పెనుగంచిప్రోలు మండలంలో అత్యధికంగా 125.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని డివిజనల్ డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి ప్రసాద్ తెలిపారు.

పంటలను ముంచెత్తిన తుపాను

మిచాంగ్ తుపాను నందిగామ ప్రాంతాన్ని వర్షం ముంచెత్తింది. ముఖ్యంగా మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పంటలు నీటమునిగగా, కల్లాల్లోని ధాన్యం రాశులు కూడా నీట మునిగాయి. ముఖ్యంగా నందిగామ, చందర్లపాడు మండలాల్లోని ఆయా గ్రామాల్లో పొలాలు వర్షాలకు దెబ్బతిన్నాయి.

పంట నష్టం పై ప్రాథమిక అంచనాలు..

తుపాను కారణంగా కోతకు సిద్ధంగా ఉన్న వరిపొలాలు ఎక్కువశాతం నీటమునిగగా, పంట నష్టంపై అధికారులు ప్రాథమిక అంచనాలు సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గంలో వరి, పుల్ల సెనగ, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు సాగవుతుండగా, మొత్తం 2,442 ఎకరాలలోని పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 162ఎకరాల కూరగాయల తోటలు దెబ్బతిన్నట్లు ఉద్యానవనశాఖ అధికారులు చెప్పారు. ఇవి కేవలం ప్రాథమిక అంచనాలు మాత్రమేనని, వర్షపునీరు తగ్గాక పూర్తి స్థాయిలో పంటనష్టాన్ని అంచనా వేస్తామని అధికారులు వివరించారు.

పేటలో 2200 ఎకరాల్లో పంటనష్టం..

జగ్గయ్యపేట: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జగ్గయ్యపేట మండలంలో పంట నష్టంపై అంచనాలు తయారు చేసినట్లు వ్యవసాయ శాఖ ఏడీఏ భవానీ బుధవారం తెలిపారు. మండలంలోని 24 గ్రామాలలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. అధిక వర్షాల కారణంగా వరి పంట 1200ఎకరాలు, మొక్కజొన్న 200ఎకరాలలో నేలవాలినట్లు చెప్పారు. 800ఎకరాల్లో మిర్చి పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ముఖ్యంగా రామచంద్రునిపేట, అనుమంచిపల్లి గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలు బాగా దెబ్బతిన్నాయని ఏడీఏ వివరించారు.

1772ఎకరాల్లో నీట మునిగిన పంటలు

కంచికచర్ల : తుపాను కారణంగా మూడు రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలకు కంచికచర్ల మండలంలో 1772 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ వర్షాలకు గనిఆత్కూరు, చెవిటికల్లు, కొత్తపేట, గొట్టుముక్కల, పరిటాల, మోగులూరు, మున్నలూరు, కునికెనపాడు తదితర గ్రామాల్లో వరి పంటలన్నీ నీటమునిగాయి. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయింది. ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను, కల్లాల్లో వర్షానికి తడిచిన ధాన్యాన్ని తహశీల్దార్ పబ్బూరి శంకరబాబు, వ్యవసాయాధికారి కె.వి జయకుమార్ పరిశీలించారు. తుపాను దెబ్బకు మండలంలో 1,202 ఎకరాల్లో వరి పంట, మంచి శెనగ 240ఎకరాలు, మినుము 130ఎకరాలు, జొన్న 170ఎకరాలు, మొక్కజొన్న 30ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఏవో విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా అధికారులకు నివేదిక పంపించినట్లు చెప్పారు. పంటలు దెబ్బతినడంతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఆయన వివరించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించినవారిలో డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, ఏఎస్ఓ దుర్గాప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

1553 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు..

వీరులపాడు: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీవర్షాలకు వరి, పుల్లశనగ, మినుము, పెసర, కంది, మిర్చి పంటలు నీటమునిగాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు నీటితో నిండటంతో, ఆ నీటిని బయటకు పంపేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. తుపాను కారణంగా మండలంలో 1558 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనావేశామని వ్యవసాయాధికారి జోగేంద్ర ప్రసాద్ తెలిపారు. 887ఎకరాల వరి, 182ఎకరాల పుల్లశనగ, 37ఎకరాలల్లో మినుము, 67 ఎకరాల పెసర, 115 ఎకరాల కంది, 225 ఎకరాల్లో మిర్చితోటలు, 40 ఎకరాల మేర కూరగాయల తోటలు, ఐదు ఎకరాల అరటితోటలు దెబ్బతిన్నట్లు ఏవో వివరించారు. ఈ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు చెప్పారు.



పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు వద్ద వరద నీటిలో వరి పొలాలు

అన్నదాతను ఆదుకుంటాం : ఉదయభాను



కొణకంచిలో నీటిమునిగిన వరి పంటను పరిశీలిస్తున్న విప్ ఉదయభాను, పక్కన ఏడీ భవాని

కొణకంచి(పెనుగంచిప్రోలు): తుపాను కారణంగా నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకుంటుందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలిపారు. కొణకంచిలో నీటమునిగిన వరిపంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 20వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తే సుమారుగా 5వేల ఎకరాల్లో నష్టం జరిగిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తడిసిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేస్తారని, రైతులు ఆందోళనపడవద్దని సూచించారు. పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపేందుకు కూలీలకు అయ్యే ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. జగనన్న ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. వర్షపు నీరు తగ్గిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తారని, రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. పంటలను నష్టపోయిన రైతులకు తప్పకుండా న్యాయం చేస్తామని ఉదయభాను హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయ శాఖ ఏడీ సి. భవాని, ఏఓ కె.రామసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాసరావు, గుంటుపల్లి వాసు, కెడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



మాగల్లులో నీటమునిగిన మిరప తోటలు పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి నీలిమ



జగ్గయ్యపేట మండలం రామచంద్రునిపేటలో నేలవాలిన మొక్కజొన్న పంట



నందిగామ పట్టణం రైతుపేట వద్ద హైవేపై కూలిన చెట్టు



గండివాగు పొంగటంతో లింగగూడెం-పెనుగంచిప్రోలు మధ్య నిలిచిన రాకపోకలు



ముచ్చింతాల వద్ద నీటిలో తేలాడుతున్న ధాన్యపు కంకులను చూపిస్తున్న రైతులు



వాగు పొంగటంతో ముచ్చింతాల-తాళ్లూరు మధ్యలో వరద నీటితో ఆగిన రాకపోకలు



దాములూరులో దెబ్బతిన్న వరిపంటను చూపిస్తున్న రైతు



అల్లూరు గ్రామంలో పత్తి చేలో నిలిచిన వర్షపు నీరు



పంటలను పరిశీలిస్తున్న అధికారులతో మాట్లాడుతున్న జోనల్ మేనేజర్ సుబ్బారెడ్డి



గనిఆత్కూరులో నీటమునిగిన వరిపైరును చూపిస్తున్న రైతులు



మోగులూరు పంటపొలాల్లో నిలిచిన నీటిని తరలింపును పర్యవేక్షిస్తున్న ఏఓ విజయకుమార్



పెద్దాపురంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఏనుగుగడ్డ వాగు

అంబేడ్కర్ గొప్ప మానవతావాది

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ప్రతిఒక్కరికి సమాన విలువ, హక్కులు ఉండాలనే ఆకాంక్షతో సమానత్వపు హక్కు సాధనకు కృషిచేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప మానవతావాది అని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్పార్టీ కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ఆధునిక తత్వవేత్తలలో దాదాసాహెబ్ అంబేడ్కర్ ప్రముఖుడని కొనియాడారు. డాక్టర్ అంబేడ్కర్ చూపిన బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నడుచుకుంటూ, రాజ్యాంగ విలువలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ పాకాలపాటి కిరణ్, పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, గుడివాడ సాంబశివరావు, తానూరి రాము, యాకుబ్‌అలీ, నాదెండ్ల నరేంద్ర, మంచాల చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని పెద్దాపురం గ్రామ సచివాలయంలో బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జుజ్జూరులో వైఎస్సార్ సీపీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సర్పంచ్‌లు నిప్పులపల్లి శాంతమ్మ, రమావత్ కోటి, ఉపసర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పూలా రాంబాబు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కొత్తపేట(కంచికచర్ల) : కొత్తపేటలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యంగ్రాతి కోటేశ్వరరావు, మాజీ సర్పంచి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పత్తిపాటి కృష్ణమూర్తి, ముప్పాళ్ల హనుమయ్య, పులి గోపి, దశరథరామయ్య, పరసా రాజీవ్‌గాంధీ, మార్కపూడి సురేష్, రాజేష్, పులి జేమ్స్, చాట్ల మురళి పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు



పెద్దాపురంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అలుపెరుగని పోరాటం చేస్తూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక బలుసుపాడురోడ్ కొలిబిబజారు, ఇందిరా కాలనీ, సత్యనారాయణపురంలోని అంబేడ్కర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, మాజీ కౌన్సిలర్ గెంటేల భాగ్యలక్ష్మి, పార్టీ కార్మిక విభాగం అధ్యక్షుడు గోగుల వెంకయ్య, ఎస్సీ నాయకులు జిడుగు నాని, చిన్ని కృష్ణ, యండ్రపల్లి సంజీవరావు, బీమవరం రమేష్, చింతపల్లి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్‌లో...

స్థానిక విశాఖ స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ యూనిట్ ఇన్‌చార్జి బీయూపీఎస్ రాజు, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రనాయక్, విజయకుమార్‌తోపాటు అధికారులు, వివిధ యూనియన్ల నాయకులు, కార్మికులు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



పేటలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ప్రభాకర్, నాయకులు

బీఎస్పీ ఆధ్వర్యంలో..

బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఆనందసాయి ఆలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆపార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కొదమల ప్రభుదాసు నివాళులర్పించారు. అంబేడ్కర్ సేవలను కొనియాడారు. ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు అన్నెపాగ పవన్‌కార్తీక్, నియోజకవర్గ కన్వీనర్ వెంకటరత్నం, పేట పట్టణ అధ్యక్షుడు షేక్ బాషా, ఉపాధ్యక్షుడు రమేష్, మండల అధ్యక్షుడు కొదమల రాజశేఖర్, నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

పేదవాడి సంతోషమే ప్రభుత్వ ధ్యేయం



కొణకంచి(పెనుగంచిప్రోలు): పేదవాడి సంతోషమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. కొణకంచిలోని ఇందిరమ్మ కాలనీలో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ ప్రజారంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో ముఖ్యమంత్రిగా రెండోసారి పట్టం కడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గోసెల దేవి, వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు దేవరపల్లి వెంకటేశ్వరరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకుమాను శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కంచికచర్ల : గడ్డిమందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సుబ్రహ్మణ్యం కథనం మేరకు ..కంచికచర్ల పెట్రోలు బంక్ సెంటర్‌లో నివాసముంటున్న తంగెళ్లపల్లి రాజశేఖర్(24)అనే యువకుడు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. వెన్నుపూస నొప్పి భరించలేక మంగళవారం సాయంత్రం గడ్డిమందు తాగి విషయాన్ని తన స్నేహితుడికి చెప్పాడు. స్నేహితుడు ఇచ్చిన సమాచారంతో కుటుంబసభ్యులు అతన్ని వెంటనే స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుతాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతున్న అతను బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి బ్రహ్మం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లోతట్టు ప్రాంతాల పర్యటన

జగ్గయ్యపేట అర్బన్: తుపాను నేపథ్యంలో పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ పర్యటించారు. మినీబైపాస్ రోడ్డు, వేపలవాగు, ఎర్రకాలువ, డాంగేనగర్, చింతలతోపు, బాలికల, బాలుర హైస్కూల్ ప్రాంతాల్లో పర్యటించి వరదనీటి తొలగింపు చర్యలను పర్యవేక్షించారు. హెడ్‌వాటర్ వర్క్స్‌లో మంగళవారం అర్ధరాత్రి హైవోల్టేజ్ మోటార్లు కాలిపోవడంతో నీటిసరఫరాకు అంతరాయం లేకుండా మున్సిపల్ సిబ్బంది ఆరుగంటలపాటు శ్రమించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

వీరులపాడు: భారీ వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ఉద్యానశాఖ ఏడీ బాలాజీ కుమార్ తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెం, జుజ్జూరు గ్రామాల్లో వర్షానికి నష్టపోయిన పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఉద్యానశాఖాధికారి నీలిమ, సర్పంచ్‌లు బొమ్మిశెట్టి దుర్గాదేవి, రమావత్ కోటి, వైస్ ఎంపీపీ షేక్ నాగుల్‌మీరా, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్‌కు నివాళి

జగ్గయ్యపేట అర్బన్: రైతుబజారు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు కీసర రాంబాబు, మన్నె శ్రీనివాసరావు నివాళులర్పించారు. గోలి రాఘవ, యర్రమాజు రఘునాథ్, సైదాబాబు, పరిమి దుర్గా, జగన్ పాల్గొన్నారు.